
# గొడుగు

సి.డి.ఎస్. రామయ్య



**పరంధామయ్య** పంతులు రోడ్డుమీద నడుస్తున్నారు.

సాయంకాలం నీరెండలో చురుకుదనం లేక పోయినా, ఆయన చేతిలోని గొడుగు ఆయన కున్న నెరిసిన బట్టతలకు నీడ నిస్తూంది. సగం అరిగిపోయిన చెప్పులు కాస్తంత కిర్రు కిర్రు చప్పుడు చేస్తూనే ఉన్నాయి. మనిషి నీరసంగా కనిపించినా, శరీరంలో అంతగా వార్ధక్యం కనిపించ లేదు.

ఆయన వెన్నంటి నలుగురుకుర్రాళ్ళు—అందరూ పదిహేనేళ్ళ లోపు వారే. నడుస్తున్నారు. ఒకరి చేతిలో పూలమాల ఉంది.

బజారు వీధిలో నడుస్తూ ఉండగా, "పంతులు గారు ఈ రోజుతో రిటైరవు తున్నారు, తెలుసా?" అని ఎవరో ఎవరితోనో అంటున్న మాటలు ఆయన చెవిలో పడ్డాయి.సంతోషిస్తున్నట్టు ఆయన పెదిమల మధ్య చిన్న నవ్వు!

తను రిటైరవుతున్నానని తెలిసినా, ఒక గంట క్రితం వరకూ పరంధామయ్య పంతులు స్కూల్లో పాఠాలు చెబుతూనే ఉన్నారు. అంతలో సభ ఏర్పాటుందనే పిలుపు వచ్చింది. స్కూలు ఆవరణలో ఏర్పాటైన వీడ్కోలు సభకు ఆ వూరి ప్రముఖులు కొందరు హాజరయ్యారు. వాళ్ళలో చాలామంది తన వద్ద పాఠాలు చెప్పించుకున్న వారే! అందులో మరో విశేషం ఏమిటంటే, ఆ నాటి సభకు డి. ఇ. ఒ. రాధాకృష్ణగారు హాజరు కావటం.

ఆ స్కూలు పిల్ల లందరూ ఆ నాటి సభకు హాజరయ్యారు. కాని, చాలామంది పిల్లల ముఖాల్లో కళాకాంతులు లేవు.

సభకు అధ్యక్షత వహించిన పంచాయతీ ప్రెసిడెంటూ, హెడ్మాష్టరు, మరి కొందరు మాస్టార్లు ఇంకా ఎందరో మాట్లాడారు. ఆఖరుగా డి. ఇ. ఒ. గారు మాట్లాడుతూ బాధ్యత గల మాస్టారుగా తను చేసిన సేవను వర్ణించారు. తన సేవ ఎంతో ఉదాత్తమైందని, తన చేత చదువు చెప్పించుకున్న వాళ్ళెందరో నేటికి గొప్ప గొప్ప వాళ్ళయి పోయారనీ పొగిడారు. ముగింపులో తను కృతజ్ఞత ( ? ) చెప్పుకోబోయి మాట్లాడారు. ఏవో కొన్ని మాటలే!

బజారువీధిలోని దుర్గమ్మ దేవాలయపు గాలి గోపురం నీడ ఆయన కేం కొత్త కాదు. ఆ నీడ కనిపించగానే చెప్పులు విడిచి,గొడుగు మూసి, అయిదు నిమిషాల పాటు మౌనంగా ప్రార్థించారు. మళ్ళీ అదే నడక!

• • • •

"అనసూయా!"

ఆ పిలుపు విని వంటగదినుండి బయటికి వచ్చింది. అనసూయమ్మ పంతులుగారి భార్య.

ఆయన లోపలికి వచ్చి చెప్పులు విడిచి, అక్కడే ఉన్న మేకుకు గొడుగును తగిలించారు. పిదప కాళ్ళు చేతులు కడుక్కుని, తుడుచుకోబోయి కండువా అందుకున్నారు. అప్రయత్నంగా ఆయన చూపులు గుమ్మం అవతల నిలుచున్న కుర్రాళ్ళ వేపు నిలిచాయి. వాళ్ళ ముఖాలలో విచారం కొట్టొచ్చినట్టు కనిపిస్తూంది. మరో కుర్రాడు పూలదండను ఆయనకు అందిస్తూ "సార్! మీరు లేని ఆ స్కూల్లో మేం వెళ్ళి చదువుకోలేము" అన్నాడు బొంగురు పోయిన గొంతుకతో.

"స్కూల్లో లేకపోతేనేం! నే నిక్కడి నుండి ఎక్కడికీ వెళ్ళనుగా! పిచ్చి ఆలోచనలు పెట్టుకోకుండా క్రమంగా వెళ్ళి శ్రద్ధగా చదువుకోండి. నా ఆశీస్సులు మీ కెప్పుడూ ఉంటాయి! వెళ్ళిరండి!" అని బుజ్జగింపుగా చెప్పి, వాళ్ళని పంపించేశారు.

కాని, ఆయన గుండెలో ఏదో బరువు, బాధ! పిల్లల మధ్య జీవితం గడిపే రోజులు ఇక లేవు! ఆ చిరునవ్వుల మధ్య అనుభూతులు పొందే కాలం ఇక రాదు!

బరువుగా వచ్చి వాలు కుర్చీలో కూర్చున్నారు పంతులు. కళ్ళ పొరలకి తడి చేరటం వల్లా, కళ్ళ జోడు ఉన్నా, మసకబారి నట్టనిపించింది. కళ్ళ జోడు తీసి, దాన్ని బట్టతో తుడవబోయి తన కళ్ళు కూడా ఒత్తుకున్నారు.

"కాలం ముగిసిందనే పేరుతో చేస్తున్న ఉద్యోగం కూడా పోయింది కదా! ఇక ఏం చేద్దామనుకుంటున్నారు?" అని దిగులుగా ప్రశ్నిస్తూ భర్త చెంతే కూర్చుంది అనసూయమ్మ.

"ప్చ్! ఆలోచిద్దాం."

ఆయన మాటల్లో పిరికిదనం కనిపించ లేదు.

రిటైర్ అయ్యే నాటికి ఆయన జీవిత కాలంలో ముప్పయి ఏళ్ళ కాలమానం మాస్టారి గిరీలోనే గడిచిపోయింది. తండ్రి ఆస్తి ద్వారా రెండెకరాల భూమీ, ఆ పెంకుటిల్లూ ప్రాప్తించినా, తను

పెళ్ళి చేసుకుని, ఇద్దర పిల్లల్ని కని పెంచి, పెద్ద చేసేసరికి, ఉన్న భూమి కాస్తా హరించుకు పోయింది. ఇక మిగిలింది ఆ ఇల్లు! పెద్ద కొడుక్కి పెళ్ళి చేయబోయి, ఆ ఇల్లు కూడా మూడు వేలు తనఖాలో ఇరిచిపోయింది. వాడికి పెళ్ళి చేసిన తరవాత, ఉద్యోగ రీత్యా భార్యతో బొంబాయికి జారుకున్నాడు. ఇక రెండో సంతానం లక్ష్మి! దానికి పెళ్ళి చేయాల్సిన వేళ దగ్గర పడింది. ఇంతవరకూ కొడుకు చేత ఏ ఆదరణా పొందలేకనే, తన సంపాదన మీదనే నిలబడ గలిగాడు. ఇక మీదట తన సంపాదన అంటూ ఏదీ లేదు! ఏం చేయాలి?

ఫండ్ మూలంగా వచ్చే పాతిక వేలతో లక్ష్మి పెళ్ళి బాగా జరిపించేయచ్చు. కాని, ఆ తరవాత తన కంటూ మిగిలే దేవిటి? తనూ, తన భార్యా ఎలా జీవించాలి? కొడుకు ఆదరణను ఎదురు చూడడం సబబేనా?

దేవాలయం నుండి తిరిగి వచ్చిన లక్ష్మి పలకరింపు పంతులుగారి ఆలోచనలకు అంతరాయం కలిగింది

• • • •

రాత్రి ఏనిమిది గంటల ప్రాంతంలో ఇంటి బయట మోటారు బండి ఆగిన చప్పుడయింది. ఎవరో తలుపు కొట్టారు. పరంధామయ్యగారు వెళ్ళి తలుపు తీశారు.

స్కూలుకు విచ్చేసిన డి. ఇ. ఒ. రాధాకృష్ణ గారు.

"మీరా! రండి, లోపలికి!" అంటూ సాదరంగా ఆహ్వానించారు పంతులు.

అనసూయమ్మ, లక్ష్మి మరో గదినుండి బయటికి వచ్చి, ఇంటిలోకి వస్తున్న కొత్త వ్యక్తిని పరామర్శగా చూడసాగారు.

ఆ యువకుడికి పాతికేళ్ళు పైబడి ఉంటాయి. దృఢంగా, బలంగా, కళ్ళజోడు పెట్టుకుని, చక్కగా ముస్తాబై ఉన్నాడు. కాస్త నల్ల బడ్డట్టున్నా, కళా కాంతీ బాగానే ఉన్నాయి.

"ఆవిడ. నా శ్రీమతి!"

"నాకు తెలుసు. నమస్కారం, తల్లీ!"

"మా అమ్మాయి లక్ష్మి!"

"లక్ష్మి!" అని ఆశ్చర్యంగా ప్రశ్నించుకుంటూనే ఆమె వేపు కళ్ళార్పకుండా చూడసాగాడు రాధాకృష్ణ 'లక్ష్మి బాగా పెరిగింది!" ఆనందంగా నవ్వుతూ. అన్నాడు.

"అంటే మీకు. లక్ష్మి గురించి—" అనుమానంగానే తడబడుతూ అడిగారు పంతులు.

"మాస్టారూ!" అని పిలుస్తూ, తన కళ్ళజోడు చేతికి తీసుకుని, "మీరు నన్ను గుర్తు పట్ట లేదూ?" అని ఆందోళనగా ప్రశ్నించాడు తను.

"రిటైరయి పోయాను కదా! ముసలితనం. ఏదీ గుర్తుండి చావదు."

"నేను. నేను మీ కిట్టిగాణ్ణి! చిన్నతనంలో నాకు అన్నం పెట్టి పోషించి, చదువు చెప్పించిన మీ ఇంటి పని మనిషి రత్తమ్మ కొడుకుని!"

రత్తమ్మ పేరు చెప్పగానే విషయం అర్థం చేసుకోవడానికి అనసూయమ్మకు అట్టే సేపు పట్ట లేదు.

పదిహేనేళ్ళ క్రితం మొగుణ్ణి పోగొట్టుకున్న రత్తమ్మ, తనింట్లోనే పని మనిషిగా ఉండేది. ఆమె కొడుకు కిట్టిగాడు. కృష్ణ అని ఎవరూ పిలిచే వారు కారు. ఆమెతోనే ఉండేవాడు. వాడూ ఇంటి పనులేవైనా చేస్తూ ఉండేవాడు. ఆ రోజుల్లో పరంధామయ్య ఇంటి స్థితి కాస్త మెరుగ్గా ఉన్నందు వల్ల, ఆ తల్లీ కొడుకులకి అంత అన్నం పెట్టడం వాళ్ళకి కష్టమనిపించ లేదు. కిట్టిగాడిలో చదువు ధ్యాస ఉందని గ్రహించిన పంతులుగారు తన స్కూల్లోనే వాణ్ణి చేర్పించారు. వాడు అయిదో తరగతి చదువుతూండగా, మాయ రోగం వచ్చి రత్తమ్మ కళ్ళు మూసింది. కిట్టిగాడు దిక్కులేని వాడయ్యాడు. అయినా వాడి మంచిగుణం, తెలివి, చురుకుదనం పంతుల్ని ఆకర్షించాయి. తనింట్లోనే ఉంచుకుని వాడికి చదువుకునే అవకాశం కల్పించారు. కాలం గడిచింది. ఆ స్కూల్లో ఉన్న ఎనిమిది తరగతులను పూర్తి చేశాడు కిట్టిగాడు. పై చదువులు చదవాలనే అభిలాష ఉన్న వాడిని నిరుత్సాహ పరచడం ఇష్టంలేక, ఒక మిత్రుడి సహాయంతో పట్నంలో వాడు చదువుకునే ఏర్పాట్లు చేయించారు పంతులు. కాని, కొంత కాలం తరవాత ఆ కుటుంబ స్థితి కిట్టిగాడనే ఒకడు తమ ఇంటిలో ఉండేవాడన్న




"కర్కశంగా, గరుకుగాఉండే
పళ్ళపొడులు మీ పళ్ళకు,
చిగుళ్ళకు
హానికలిగించవచ్చు..."

TP.G.30 TL

**కోల్గేట్ టూత్ పౌడర్‌తో మీ చిగుళ్ళను, చెడుశ్వాసను కూడా అరికట్టండి, పళ్ళను కాపాడుకోండి.**

కోల్గేట్ టూత్ పౌడర్ ఎంతో మెత్తగా ఉండే తెల్లని పౌడర్. అది అతి మృదువుగా మీ చిగుళ్ళను తోముతుంది. అంతేగాకుండా దానిలో ఉండే సున్నితమైన మెరుగునిచ్చే పదార్థం మీ పళ్ళ మీది పాచిపొరలను తొలగిస్తుంది. మీ పళ్ళను శుభ్రపరచి తెల్లగా చేస్తుంది. కోల్గేట్‌లోని పుష్కలమైన నురుగునిచ్చే చర్య పళ్ళ సందులలోనికి చొచ్చుకుపోయి చెడు వాసనను దంతక్షయ కారకములైన సూక్ష్మ క్రిములను తొలగిస్తుంది.

మీ కుటుంబానికి కోల్గేట్ టూత్ పౌడర్‌తో అధునాతనమైన తీరులో దంతరక్షణ సమకూర్చండి. దానియొక్క చల్లని, పిప్పర్‌మెంట్ రుచిని వారంతా మెచ్చుకుంటారు..



సంగతే మరిచిపోయారు.

"మువ్వా, బాబూ! నమ్మలేకుండా ఉన్నాను!" అంటూ అతన్ని సమీపించి, "బాగున్నావా, బాబూ?" అని ఆప్యాయంగా అడిగింది అనసూయమ్మ.

"మీ చల్లటి ఆశీస్సుల తోనే నే నింతటి వాణ్ణయ్యాను. అంతా ఈ అమృత హస్తాల చలవ!" అంటూ ఆమె చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుని కళ్ళ కద్దుకున్నాడు రాధాకృష్ణ.

కాని, పరంధామయ్యకు గతం గుర్తు రావడానికి కొంత సేపు పట్టినా, అతన్ని పోల్చుకున్నారు. "బాబూ! నిన్ను ఇంతటి ఉన్నత స్థితిలో చూడడం, అందులోనూ నాకు పై అధికారిగా చూడడం నా కెంతో గర్వంగా ఉంది" అని గంభీరంగానే అన్నారు.

డి. ఇ. ఒ. రాధాకృష్ణ తన హోదా సంగతే మరిచి పోయాడు. పంతులుగారి పాదాలను తాకి నమస్కరించాడు.


"మాస్టారూ! ఆనాడు మీరు నిండుహృదయంతో నా చదువు గురించి ప్రోత్సాహం చూపించి ఉండక పోతే, నే నీ స్థితికి వచ్చి ఉండేవాణ్ణి కాను. నాకు తండ్రి ముఖం తెలీదు. తల్లి ఆదరణకు నేను నోచుకోలేదు. ఆత్మీయులు అసలే లేరు. కాని, నాకు విద్యా బుద్ధులు చెప్పించిన మీరే నాకు తల్లీ తండ్రీ, అంతకు మించిన దైవాలు!" అని అంటూన్నంతలో అతని గొంతుక బొంగురు పోయింది.

ఇన్ని బాసలు తన ముందే జరుగుతున్నా, లక్ష్మికి అంతా ఏదో గజిబిజిగా నే ఉంది. ఆ స్థితిలో అనసూయమ్మ ఆమెను సమీపించి, "లక్ష్మీ! నీ చిన్నతనం —అంటే నీ మూడేళ్ళ ప్రాయం వరకూ నువ్వు ఈ బాబు చేతుల్లోనే పెరిగావమ్మా! అందుకే ఇంత కాలం తరవాత నిన్ను చూసి ఆశ్చర్య పోతున్నాడు!" అని నవ్వుతూ అంది.

లక్ష్మికి ఆ కిట్టిగాణ్ణి గురించి గుర్తుండడంలో న్యాయం లేదు. ఎందుకంటే, అప్పటి పసితనం అలాంటిది. తల్లి చెప్పిన తరవాత లక్ష్మికి అతనికి అభిమాన పూర్వకంగా చేతులు జోడించి నమస్కరించింది. కాని, అతని కళ్ళకి ఆమె ఇంకా పసిపాప లాగానే కనిపించింది. చిన్నతనంలో లాలించి, బుజ్జగించి, జోగొట్టిన దృశ్యాలు అతని కళ్ళ ముందు మెదిలాయి. ఆ చిన్నతనంలో లాగే ఇప్పుడూ ఆ బుగ్గలు ముద్దెట్టుకోవాలనిపించింది. కాని, అంత సాహసం చేయలేక పోయాడు. ఆ అనుభూతుల మధ్య, అతని కళ్ళు నీళ్ళు కుమ్మరించాయి. అవి ఆనందబాష్పాలు!

"దురదృష్టం కొద్దీ నా తల్లికి నేను ఒక్కడే పుట్టాను. నాకు తోబుట్టువు లంటూ ఎవరూ లేకపోయారు. లక్ష్మిని చిన్నతనంలో లాలించినప్పుడు నా కొక చెల్లె లుంటే ఎలా గనిపించేదో... అలాగే అనిపించేది. ఆ మమకారం నే నెప్పటికీ మరవలేను. లక్ష్మీ! నేను నీకు పరాయివా డనిపించినా, నువ్వు నూరేళ్ళు చల్లగా జీవించాలని నా మనసారా కోరుకుంటున్నా. దట్... దట్సాల్." అంటూ తన ఆందోళనను అదుపులోకి తెచ్చుకోడానికి ప్రయత్నించాడు రాధాకృష్ణ.

అతని ఆప్యాయత నిండిన ఆందోళనకు లక్ష్మి




కూడా కొంత సేపు కలవరపాటు చెందింది.

"ఒరేయ్ కిట్టూ! సంవత్సరాల తరబడి పెంచి పెద్ద చేసిన వాళ్ళే. ఈ రోజుల్లో నిమిషాల మీద మరిచి పోతున్నప్పుడు, నువ్వెందుకురా ఇలా బాధ పడుతున్నావ్? కూర్చో." పరంధామయ్య పంతులు అతన్ని సముదాయించ బోయి అన్నారు.

తమనుండి దూరమైన తరవాత, అతని జీవితం ఎలా గడిచిందో చెప్పమని అడిగింది అనసూయమ్మ.

పట్నంలో తను హైస్కూలు చదువు ముగించిన తరవాత కాలేజీలో ప్రవేశించడం కాస్త కష్టమే అనిపించింది. రాత్రిళ్ళలో కూలీ నాలీ చూసుకుని చదువు సాగించాడనీ, ఆ పిదప చాలామంది విద్యార్థులు తనకు సాయ పడ్డారనీ, అందులోనూ, మేరీ అనే అమ్మాయి చేసిన సాయం వల్ల తన చదువు సక్రమంగా సాగి పూర్తయి, ఉద్యోగంకూడా లభించిందనీ ఆ పరిచయమే ప్రేమగా మారి, ఆమెను తను వివాహం చేసుకున్నాననీ చెప్పి ముగించాడు రాధాకృష్ణ.

"మరి నీతోపాటు అమ్మాయినికూడా తీసుకు రాలేక పోయా వేమిటి?" ఇది అనసూయమ్మ ప్రశ్న.

"మరో మతం అమ్మాయిని చేసుకున్నందుకు మీరు కోప్పడతారేమోనని."

"పిచ్చినాగన్నా! మతమూ, కులమూ—మనుషులు సృష్టించుకున్నవి గదరా! ఆత్మీయతకు మనస్సులు కారణమయినప్పుడు, మరే అడ్డంకులూ ఎదురవడంలో న్యాయం లేదు! మంచి పనే చేశావ్!" అని పరంధామయ్య అన్నారు.

రాధాకృష్ణ తన సూటుకేసు నుండి రెండు మంచి చీరలు తీసి ఒకటి అనసూయమ్మకూ, మరొకటి లక్ష్మికి అందించాడు. తరవాత సరి కొత్త గొడుగును పరంధామయ్యగారి కిస్తూ—

"మాస్టారూ! కష్ట సుఖాల్లో ఒక మనిషిని ఆదుకో గలిగిన వారు ఆత్మీయులే నన్న సంగతి మీకు తెలుసు. గొడుగు ప్రభావంకూడా అలాంటిదే. ఎండకూ, వానకూ శరీరానికి రక్షణ ఇవ్వగలిగేది ఇదే! మీకు దీని వాడకం ఎంత అవసరమో నాకు తెలుసు కాబట్టే తీసుకొచ్చాను. అలాగని ఎంతో కాలం నుంచి మీరు వాడుతున్న పాత గొడుగును గురించి నేను తప్పు పట్టడం లేదు. దీన్ని మీరు నా జ్ఞాపకార్థంగా ఉపయోగించుకోవాలని కోరుతున్నాను. ఇది మీ చేతుల్లో ఉన్నంత వరకూ మీకు నా జ్ఞాపకం ఉంటుంది కదా—అందుకని."

గొడుగునీ, రాధాకృష్ణనీ మార్చి మార్చి తీక్షణంగా చూశారు పంతులుగారు. చేతి కందిన వాడు తమకు ఎలాటి ఆదరణా చూపలేక పోయినా, ఏ నాడో ఆదరణ చూపించినందుకు ఆప్యాయత కనపరుస్తున్న ఈ యువకుణ్ణి గురించి ఏమనుకోవాలి? ఈ లాంటి మనుషులు కోటిలో ఒక్కడైనా కనపడ్డం అరుదేమో!

"కిట్టూ! తెలివైన పని చేశావోయ్! కొడుకై పుట్టినవాడు తల్లిదండ్రులకి గొడుగై జీవించాలని అంటారు. కాని, కొడుకున్నా, నే నా అదృష్టానికి నోచుకోలేదు. థాంక్స్ ఫర్ యువర్ కైండ్ ప్రజంట్!" అని గంభీరంగా నవ్వుకున్నారు.

"మరో మాట! లక్ష్మి పెళ్ళికి నన్ను పిలవడం మరిచిపోకండి! ఆ శుభ కార్యాన్ని కళ్ళారా చేసే అదృష్టం మాకు కలగ నివ్వండి. నేనూ, నా భార్యా వచ్చి, ఆ శుభ కార్యానికి మా చేతనయినంత చేయూత నిస్తాం" అన్నాడు రాధాకృష్ణ.

"మేము మిమ్మల్ని పిలవమోయ్!" పంతులుగారు అన్నారు.

"మాస్టారూ?"

"మీరే దగ్గరుండి జరిపించాల్సి ఉంటుంది అందుకని" అని పరంధామయ్య నవ్వారు. అందరూ నవ్వుకున్నారు ఆయన చమత్కారానికి!

"మరో విషయం!" అంటూ కొన్ని డాకుమెంట్స్‌ని పంతులు చేతి కిస్తూ "మాస్టారూ! మీ ఇల్లు తాకట్టులో ఉందని తెలిసింది. ఉడతాభక్తిగా మీ ఋణం తీర్చుకునే ప్రయత్నంగా దాన్ని తాకట్టునుండి విడిపించేశాను. మీకు చెప్పకుండా చేసినందుకు క్షమించండి. ఇదిగో!" అన్నాడు.

పరంధామయ్యగారు ఆనందాశ్చర్యాలతో తబ్బిబ్బు లయ్యారు!

"కిట్టూ! ఎప్పుడో చిన్నతనంలో చేసిన సాయానికి ప్రత్యుపకారంగా నువ్వీనాడు నా కుటుంబాన్ని ఆదుకుంటున్నవంటే—"

"ఇది ప్రత్యుపకారమూ, ప్రతిఫలమూ కాదు, మాస్టారూ! గురుదక్షిణ!" అన్నాడు రాధాకృష్ణ.

"మంచి గురుదక్షిణే!" అని ఆనందంగా నవ్వుకుంది అనసూయమ్మ. ★